# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఈ నెల 23వ తేదీన కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, వివిధ రంగాల నిపుణులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలో సమావేశం నిర్వహించారు.**

**2.** **ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేందుకే రాష్ట్రంలో నైపుణ్య గణనపై ప్రధానంగా దృష్టి సారించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**

**3.** **ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి శాఖ ఆదాయం సాధించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**4.** **గ్రామాలకు రహదారుల అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తేనే ప్రగతి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**

**5.** **ప్రజాపంపిణీ వ్యవస్థలో అవినీతికి తావులేకుండా సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

===========================

దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, వివిధ రంగాల నిపుణులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ నెల 23వ తేదీన కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో నిన్న ఢిల్లీలో జరిగిన ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హాజరయ్యారు. అన్నివర్గాలను సంతృప్తి పరిచేలా బడ్జెట్ రూపకల్పన చేయడంతో పాటు, పెట్టుబడులు రాబట్టడం ద్వారా వృద్ధిరేటు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ఆర్థికవేత్తలు, నిపుణుల అభిప్రాయలు, సూచనలను ప్రధానమంత్రి అడిగి తెలుసుకున్నారు.

---------------------------

రాష్ట్రంలో నైపుణ్య గణనపై ప్రధానంగా దృష్టి సారించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్‌ను నిన్న సందర్శించిన ఆయన, రెండు కొత్త కంపెనీలను ప్రారంభించారు. ఆ తర్వాత భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించిన జాతీయ కౌన్సిల్ సమావేశంలో అక్కడ నుంచే వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేందుకే నైపుణ్య గణన చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. తయారీ రంగానికి ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మక ప్రాంతమని, విశాఖపట్నాన్ని ఫిన్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చంద్రబాబునాయుడు

వివరిస్తూ..

... వాయిస్..40 సెకన్లు

---------------------------

అంతకు ముందు విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ ప్రాంతాన్ని విహంగ వీక్షణం ద్వారా ఆయన పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఒక ఎకనామిక్ హబ్‌గా మారుతుందని తెలిపారు. బీచ్‌రోడ్ నిర్మాణం భోగాపురం వరకు జరగాలని.. పారిశ్రామికంగా ఎదిగేందుకు ఈ ప్రాంతానికి మంచి అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి శాఖ ఆదాయం సాధించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ల శాఖల పనితీరుపై నిన్న ఆయన సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. లక్ష్యం మేరకు ఆదాయం ఆర్జించాలంటే శాఖలవారీగా సంస్కరణలు, కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు.

---------------------------

గ్రామాలకు రహదారుల అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తేనే ప్రగతి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధులతో విజయవాడ క్యాంపు కార్యాలయంలో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 4 వేల 976 కోట్ల నిధులతో 7 వేల 213 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలకు చురుగ్గా కార్యరూపం ఇవ్వాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం వల్ల పేదరిక నిర్మూలనతో పాటు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు మెరుగవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. మ్యాచింగ్ గ్రాంట్ 10శాతానికి తగ్గించేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.

---------------------------

ప్రజాపంపిణీ వ్యవస్థలో అవినీతికి తావులేకుండా సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. విజయవాడ ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజారులో కందిపప్పు, బియ్యం కౌంటర్‌ను నిన్న ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు, బియ్యం తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో 284 ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించామని తెలిపారు. ఈ కౌంటర్లలో కిలో కందిపప్పు 160 రూపాయలు, సన్న బియ్యం కిలో 49 రూపాయల చొప్పున విక్రయిస్తున్నామని చెప్పారు. త్వరలో చక్కెర, చిరుధాన్యాలను కూడా ఈ కౌంటర్ల ద్వారా తక్కువ ధరకే అందిస్తామని మంత్రి ప్రకటించారు.

---------------------------

రైతు భరోసా పథకంపై అభిప్రాయాలు తెలుసుకునేందుకే రైతు భరోసా సదస్సులు నిర్వహిస్తున్నామని

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నిన్న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో రైతు భరోసా కార్యశాల నిర్వహించారు. మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం విధివిధానాలపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అన్నదాతల అభిప్రాయాల మేరకు ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని స్పష్టంచేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ నిన్నబాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయన.. స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 250 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి.. గత ప్రభుత్వం విపరీతంగా పన్నులు పెంచేసిందని వ్యాపారాలు చేసుకోలేనంత స్థాయిలో పన్నులను పెంచడంతో ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని తెలిపారు. ఆదాయం పెరగాలంటే పన్నులు పెంచడమే మార్గం కాదని.. పన్నుల విస్తృతిని పెంచాలని కేశవ్ సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. 16 మంది ఐఏఎస్ అధికారులను, 11 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్‌పీ సిసోడియాను రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, జి.జయలక్ష్మిని భూపరిపాలన ప్రధాన కమిషనర్.. సీసీఎల్ఏగా నియమించారు. వాడ్రేవు వినయ్‌చంద్‌ను పర్యాటక శాఖ కార్యదర్శిగా.. వివేక్ యాదవ్‌ను యువజన సర్వీసుల విభాగం కార్యదర్శిగా, హిమాన్షు శుక్లాను సమాచార శాఖ డైరెక్టర్‌గా నియమించారు. ఎస్.ఢిల్లీరావును వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా, ఎస్.సురేశ్‌కుమార్‌ను మౌలిక వసతులు-పెట్టుబడుల కార్యదర్శిగా బదిలీచేశారు. కళాశాల విద్య కమిషనర్‌గా ఉన్న పి.భాస్కర్‌ను బీసీ సంక్షేమ కార్యదర్శిగా బదిలీచేశారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తాను విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా.. ఆయన స్థానంలో కుమార్ విశ్వజితను హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీఅయ్యారు. శాంతి భద్రతల విభాగం ఐజీగా సీహెచ్ శ్రీకాంత, అగ్నిమాపక శాఖ డీజీగా మాదిరెడ్డి ప్రతాప్ నియమితులయ్యారు. ఎస్వీ రాజశేఖర్‌బాబు విజయవాడ పోలీసు కమిషనర్‌గా, గోపీనాథ్ జెట్టిని విశాఖపట్నం రేంజ్ డీఐజీగా, కోయ ప్రవీణ్ కర్నూలు రేంజ్‌కు బదిలీ అయ్యారు.

---------------------------

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో నిన్న సాయంకాయం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా.. తెలంగాణలో రాబోయే మూడు రోజులు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. ఈ రోజు, రేపు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఈ తెల్లవారుఝామున ఒక మోస్తరు వర్షం కురిసింది. విజయవాడలో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.

---------------------------

ఆధార్ పోర్టల్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నిన్న ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆధార్‌కార్డు అనుసంధానం విషయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో దేశంలోని చాలాప్రాంతాల్లో సర్వర్లు మొరాయించాయని, ఫలితంగా నిన్న మధ్యాహ్నం నుంచి రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు.

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షకు హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 వేల 62 ఉపాధ్యాయ ఉద్యోగాలకు జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా.. దాదాపు 2 లక్షల 7 వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తమ చెల్లింపు రసీదు ఐడీ లేదా ఆధార్ నంబర్, పోస్టు కేటగిరీ, మాధ్యమం, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి హాల్‌టికెట్లు పొందొచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం..ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఎంపికైన విద్యార్థుల తుది జాబితాను ఏలూరు జిల్లా నూజివీడు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిన్న విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థుల్లో 67.15శాతం బాలికలు, 32.85శాతం మంది బాలురు ఉన్నారు.

======================